# ఆకాశవాణి హైద్రాబాద్ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

తేది : 16.05.2012 సమయం : 18.15 నిమిషాలు

### ముఖ్యాంశాలు

1. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో రాష్ట్రంలో ఇసుక తవ్వకాలను నియంత్రించేందుకు ఒక నూతన విధానం ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తుంది.

2. ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం ఈరోజు నల్గొండ జిల్లాలో పర్యటించి ఎస్.సి, ఎస్.టి సంఘాల నుంచి సూచనలను స్వీకరించింది.

3. రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ తన 6 సంవత్సరాల బిటెక్ కోర్సుల్లో ప్రవేశానికి నాన్ రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 4 శాతం మార్కులను కలపనుంది.

4. రాష్ట్రంలో ఉపఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో ఏర్పాట్లను ఎన్నికల సంఘం ప్రధాన అధికారి భన్వర్‌లాల్ రేపు సమీక్షిస్తారు.

-----

సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఇసుక తవ్వకాలపై నూతన విధానాన్ని రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం ఇసుక తవ్వకాలపై ఒక వ్యవస్థను రూపొందిస్తామని గనులు, భూగర్భ శాఖా మంత్రి గల్లా అరుణకుమారి ఈరోజు హైదరాబాద్‌లో విలేఖరులకు తెలియజేశారు. కాగా, ఈ మధ్య కాలంలో ఇసుక అవసరాలను తీర్చేందుకు రాష్ట్రంలోని 47 ఇసుక రీచెస్‌లో పదిహేనింటికి పర్యావరణ ఆమోదం కోరినట్లు ఆమె తెలిపారు. అంతేకాకుండా పట్టా భూముల్లోని 29 ప్రాంతాల్లో రాష్ట్ర గనుల అభివృద్ధి సంస్థ ద్వారా ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతిని ఇచ్చినట్టు మంత్రి తెలిపారు. తక్షణ ఇసుక అవసరాల కోసం 31 ముంపునకు గురైన ప్రాంతాలు, నీటి అడుగున ఉన్న ఇసుక నిక్షేపాలను గుర్తించినట్టు ఆమె తెలియజేశారు. రాష్ట్రంలో సంవత్సరానికి 2 కోట్ల చదరపు మీటర్ల ఇసుక అవసరం వుందని, 1.75 కోట్ల చదరపు మీటర్ల ఇసుక అవసరాల కోసం తగు చర్యలు చేపట్టినట్టు మంత్రి తెలిపారు. ఇసుకకు ప్రత్యామ్నాయంగా రోబోశాండ్, తయారీ చేసిన ఇసుక వాడాలని, ఈ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం వుందని ఆమె అన్నారు. రోబోశాండ్‌కు సంబంధించి స్టోన్‌క్రషింగ్ సంస్థల ప్రతినిధులతో ఈరోజు ఒక సమావేశం నిర్వహించినట్టు మంత్రి తెలిపారు. వంతెనలు, రోడ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణంలో ఉత్పత్తి చేసిన ఇసుకను వినియోగించే విషయంపై రోడ్లు, భవనాల శాఖ ఇంజనీర్లు, అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు మంత్రి తెలియజేశారు.

-------

ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం ఈరోజు నల్గొండ జిల్లాలో పర్యటించింది. ఈ కమిటి వివిధ ఎస్.సి, ఎస్.టి సంఘాల నుంచి, ఇతర ప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించింది. ఈ సూచనలన్నింటిని పొందుపరిచి ప్రభుత్వానికి ఒక నివేదికను అందిస్తామని ఉపముఖ్యమంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గీతారెడ్డి, కొండ్రు మురళీమోహన్, ఎమ్.పి గుత్తా సుఖేందర్‌రెడ్డి, పలువురు ఎమ్.ఎల్.ఏలు, ఎమ్.ఎల్.సీలు శాసన మండలి చీఫ్‌విప్ భారతి రాగ్యానాయక్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

-------

6 సంవత్సరాల సమగ్ర బిటెక్ కోర్సులో ప్రవేశానికి నాన్ రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 4 శాతం మార్కులు కలుపుతారని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ప్రకటించింది. విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా వచ్చేనెల 16వ తేదీ వరకు పంపించవచ్చునని విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆర్.వి.రాజ్‌కుమార్ ఈరోజు హైదరాబాద్‌లో విలేఖరులకు తెలియజేశారు. మెరిట్‌లిస్ట్ జూలై 2వ తేదీన ప్రకటిస్తారని, తొలి కౌన్సిలింగ్ జూలై 19, 20 తేదీల్లో జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ విశ్వవిద్యాలయం ఇందుకు సంబంధించి ఒక నోటిఫికేషన్ ఈరోజు జారీ చేసింది. ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రక్రియ ఈ నెల 28 నుంచి ప్రారంభమవుతుంది. రెండవ కౌన్సిలింగ్ జూలై 23వ తేదీన ప్రారంభమవుతుంది.

విశ్వవిద్యాలయానికి చెందిన మూడు ప్రాంగణాలలోని 3 వేల సీట్లను భర్తీ చేస్తామని వైస్‌ఛాన్సలర్ తెలిపారు. ట్రిపుల్‌ఐ.టిగా ప్రసిద్ధి చెందిన ఆర్.జె.యు.కె.టిలో సంవత్సరానికి ట్యూషన్ ఫీజు 35 వేల రూపాయలు. విశ్వవిద్యాలయం నిబంధనల ప్రకారం 70 శాతం సీట్లను గ్రామీణ విద్యార్థులతో భర్తీ చేస్తామని, ప్రభుత్వం ఈ ఏడాది విశ్వవిద్యాలయానికి 600 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని వైస్‌ఛాన్సలర్ తెలియజేశారు.

-------

పారిశ్రామికవేత్త నిమ్మగడ్డ ప్రసాద్, ప్రభుత్వ అధికారి కె.వి.బ్రహ్మానందరెడ్డిలకు నాంపల్లిలోని సి.బి.ఐ ప్రత్యేక న్యాయస్థానం ఈనెల 30వ తేదీ వరకు జ్యుడిషియల్ కస్టడీని విధించింది. కడప ఎమ్.పి వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహనరెడ్డి అక్రమ ఆస్తుల కేసులో వీరిద్దరు నిన్న అరెస్టయ్యారు. ఈరోజు మధ్యాహ్నం కోర్టులో వీరిని ప్రవేశపెట్టగా, సి.బి.ఐ ప్రత్యేక న్యాయస్థానం ఈ ఆదేశాలను జారీ చేసింది. ఆ తరువాత వీరిద్దరిని చెంచల్‌గూడా జైలుకు తరలించారు. కాగా, వీరిద్దరిని 15 రోజులు కస్టడీలో ఉంచాలని సి.బి.ఐ కోరింది. అయితే కోర్టు సి.బి.ఐ వాదనలను విన్న అనంతరం కేసు విచారణను ఈ నెల 17వ తేదీకు వాయిదా వేసింది.

------

రాష్ట్రంలో ఉపఎన్నికలు జరుగుతున్న నియోజకవర్గాల్లో ఏర్పాట్లను ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్ రేపు సమీక్షిస్తారు. ఉపఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన ఈరోజు హైదరాబాద్‌లో విలేఖరులకు తెలియజేశారు. ఎన్నికల నిబంధనావళిని కచ్చితంగా అమలు చేసేందుకు ఎన్నికల సంఘం వివిధ రాజకీయపార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నది. రేపటి సమావేశానికి గుర్తింపు పొందిన 8 జాతీయ, ప్రాంతీయ పార్టీల ప్రతినిధులను ఆహ్వానించినట్టు భన్వర్‌లాల్ తెలియజేశారు.

------

శ్రీకాకుళం జిల్లాలోని నర్సన్నపేట ఉపఎన్నికలకు 250 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల విధి నిర్వహణ కోసం 750 మంది అధికారులను నియమించారు. అక్రమ మద్యాన్ని నివారించేందుకు 4 సంచార పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 32 జోనల్ అధికారులను నియమించినట్టు జిల్లా కలెక్టర్ జి.వెంకటరామిరెడ్డి ఈరోజు తెలియజేశారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కటౌట్లు, బ్యానర్లను తొలగించవలసిందిగా పోలీసులకు ఆదేశాలు అందాయి. జిల్లా కలెక్టర్ ఈరోజు శ్రీకాకుళంలో అధికారులకు ఎన్నికల శిక్షణా తరగతులను ప్రారంభించారు.

-------

రాష్ట్రంలో ఉపఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో ప్రచారం వూపందుకుంది. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తమ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఈరోజు నెల్లూరులో ఉపఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయన పార్టీ ముఖ్యులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పలువురు శాసనసభ్యులు పాల్గొన్నారు. మరోపక్క టి.డి.పి అధ్యక్షుడు చంద్రబాబునాయుడు నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా, వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహనరెడ్డి కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో ఎన్నికల ప్రచారం జరుపుతున్నారు. ఇందులోభాగంగా ఆయన ఆళ్లగడ్డ, చాకలమర్రి మండలాల్లో రోడ్‌షోలు నిర్వహించారు.

కాగా వరంగల్ జిల్లాలోని పరకాల నియోజకవర్గంలో మంత్రులు బసవరాజు సారయ్య, పొన్నాల లక్ష్మయ్య కాంగ్రెస్ తరఫున ప్రచారం చేస్తుండగా, టి.డి.పి నాయకులు కడియం శ్రీహరి, ఎర్రబెల్లి దయాకరరావు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు.

టి.ఆర్.ఎస్ పార్టీ ప్రచారంలో భాగంగా 'పల్లెబాట' కార్యక్రమాన్ని చేపట్టింది. బి.జె.పి నాయకులు ఇప్పటికే 'పల్లెనిద్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. పరకాల నియోజకవర్గంలో అక్రమంగా తరలుతున్న 50 లక్షల రూపాయలను అధికారులు జప్తు చేశారు. టి.ఆర్.ఎస్ పార్టీ పరకాలకు ఈరోజు భిక్షపతిని తన అభ్యర్థిగా ప్రకటించింది. బి.జె.పి మినహా అన్ని పార్టీలు తమ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించాయి. ఇదిలా ఉండగా, 18 అసెంబ్లీ స్థానాలు, నెల్లూరు లోక్‌సభ స్థానానికి ఎన్నికల నోటిఫికేషన్ శుక్రవారం నాడు జారీ అవుతుంది. నామినేషన్లు ఈ నెల 25వ తేదీ వరకు స్వీకరిస్తారు.

------

విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్‌లు, ఫీజురియంబర్స్‌మెంట్ పథకాలను ప్రభుత్వం నీరుగారుస్తోందని టి.డి.పి, వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీలు చేసిన ఆరోపణలను ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ఖండించారు. గతంలో కంటే ఈ పథకాలను మరింత సమర్ధవంతంగా నిర్వహిస్తున్నట్టు ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు. 2011-12 సంవత్సరంలో 23 లక్షల 98 వేల మంది విద్యార్థులు లబ్ధిపొందారని టి.డి.పి హయాంతో పోలిస్తే లబ్దిదారుల సంఖ్య 330 శాతం పెరిగిందని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

------

రాష్ట్రం నుంచి 2012 హజ్ సీజన్‌లో హజ్ యాత్రీకులకు మార్గనిర్దేశం చేసే హజ్ సేవకులను లాట్ల ద్వారా హైదరాబాద్‌లోని నాంపల్లిలో గల హజ్ హౌస్‌లో ఈ నెల 19వ తేదీన ఉదయం 11 గంటల 30 నిముషాలకు ఎంపిక చేస్తారు. హజ్ యాత్రీకులకు భారత్ - సౌదీ అరేబియా దేశాల్లో మార్గ నిర్దేశం చేసేందుకు ప్రాంతాల వారీగా మొత్తం పదహారుగురు హజ్ సేవకులు - ఖదీమ్ ఉల్ హజాజ్‌లను ఎంపికచేస్తారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటి ఎగ్జిక్యూటివ్ అధికారి అబ్దుల్ హమీద్ తెలియజేశారు.

------

దేశంలో చక్కెర ఉత్పత్తి 251 లక్షల టన్నులు ఉంటుందని అంచనా. పత్తి ఉత్పత్తి 352 లక్షల బేళ్లు ఉండవచ్చు. రాజ్యసభలో ఈరోజు వాణిజ్యశాఖ సహాయమంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఈ విషయాన్ని తెలియజేశారు. సంబంధిత మంత్రిత్వ శాఖలతో సంప్రదింపులు జరుపుతూ- చక్కెర, పత్తితో సహా అన్ని ఉత్పత్తుల ఎగుమతుల విధానాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్టు మంత్రి తెలియజేశారు.

------

రాష్ట్రంలో వడగాల్పులు కొనసాగుతున్నాయి. రెంటచింతలో నిన్న అత్యధికంగా 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయినట్లు వాతావరణ శాఖ తెలియజేసింది. తెలంగాణా, రాయలసీమల్లోని ఒకటి రెండు ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత పెరగవచ్చునని, కోస్తాంధ్రలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చునని వాతావరణ శాఖ తెలియజేసింది. రాయలసీమలోని కొన్ని ప్రాంతాలలో వర్షాలు పడ్డాయి. కాగా, తెలంగాణా కోస్తాంధ్రాలలో చెదురుమదురు వర్షాలు కురిసాయి. కడపజిల్లా రాజంపేటలో 6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, నెల్లూరు జిల్లాలోని గూడూరు, సీతారామపురం, చిత్తూరు జిల్లాలోని కల్కడాల్లో 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఇదిలా ఉండగా, వాయువ్య రుతుపవనాలు కేరళలో జూన్ 1వ తేదీన ప్రవేశించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

------